చెయ్యచ్చు కదా. పోనీలే వాళ్ళిష్టం. మనం చెబితే మాత్రం వింటారా'' అంది దీర్ఘంతీస్తూ.

ఆ మాటలకు సుశీలమ్మ కించిత్తు కలవర పడింది. నిజమే. పిల్లల సుఖంకాక తమకేం కావాలి ఈ వయస్సులో. వాళ్ళేం ఆస్తులు అడగటం లేదు. కాస్తంత రెక్క సాయం అడుగుతున్నారు. పోన్లే ఓ పదిరోజులుండి వస్తే పోలా అనుకుంది.

ప్రయాణమై కొడుకుతో బయల్దేరుతున్న సుశీలమ్మను పక్కకు పిలిచి తన దగ్గర పాతిక రూపాయలుంటే ఆమె చేతిలో పెట్టాడు ప్రకాశరావు. "ఆరోగ్యం జాగ్రత్త. పనిరంధిలో ఉంటే తిండి కూడా మర్చిపోతావు. పదిరోజులుండి రా'' చెప్పాడు భార్యకి.

ఆయన్ను వదిలి రైలెక్కిన సుశీలమ్మ కళ్ళల్లో సన్నని నీటి తెర. అలా వచ్చిన సుశీలమ్మ, కొడుకు దగ్గరకి వచ్చి పదిరోజులు కాదు... నెలరోజులైనా తన తిరుగు ప్రయాణం మాట ఎత్తడు. ఇదిగో అదిగో అని దాటవేస్తూ మరో నెలరోజులు గడిచి పోయాయి. సుశీలమ్మకు భర్తను గురించి ఆలోచనలతో పనిమీద మనసు లగ్నం కావటం లేదు. "ఒరేయ్ నన్ను ఆయన దగ్గర దిగబెట్టరా. ఆయన ఎలా ఉన్నారో ఏమో'' అంది ఓరోజు సిగ్గువిడిచి. "నీదంతా చాదస్తమమ్మా ఎలా ఉండటం ఏమిటి? నాన్నగార్ని అక్కయ్య బాగా చూసుకుంటుంది. నువ్వేం బెంగెట్టుకోకు'' అన్నాడు.

"పోనీ ఉత్తరమైనా రాయరా'' అంది నిరాశగా.

"అలాగేలే" అంటూ ఆఫీసుకి వెళ్ళిపోయాడు శ్రీధర్.

కొడుకింట్లో సుశీలమ్మ ఓ చాకిరీ చేసే బొమ్మ నట్టి విరిగేటట్టు చాకిరీ చెయ్యాలి. ఆదివారం కోడలింట్లోనే ఉంటుంది గదా అనుకుంటే ఉదయాన్నే మనవళ్ళ తనకి అప్పజెప్పి ఇద్దరూ బయటకు వెళ్ళిపోతారు శ్రీధర్, లలిత. లేకపోతే, "అమ్మా నువ్వు తయారు చేసినట్లు పులిహోర ఎవరికీ కుదర్దు. మా ఆఫీసర్‌కూడా మెచ్చుకున్నారు. మేం పిక్నిక్ ప్రోగ్రాం వేసుకున్నాం' అంటూ దాంతో పాటే మరో రెండు ఐటమ్స్ కూడా చెప్పి చేయించి పట్టుకుపోతాడు కొడుకు. కోడలు మరీ తెలివిగలది. నోటితో ఎక్కువగా చెప్పదు. పరోక్షంగా చెప్పి చేయించుకుంటుంది. మధ్య మధ్యలో 'అత్తగారికి చాలా శ్రమ ఇస్తున్నామండీ' అంటుంది. అది పొగడటమో నొచ్చుకోవటమో సుశీలమ్మకు అర్థంకాని విషయం.

ఆర్నెల్లు గడిచాయి. సుశీలమ్మకు ఆరు యుగాలు గడిచినట్లుంది. అడపాదడపా ప్రకాశరావు రాసే ఉత్తరాలు కొడుకు ఆఫీసుకి వస్తాయి. కొడుకు 'అంతా బావున్నాం' అంటూ పొడిగా ఓ ఉత్తరం రాసి పడేస్తాడేగానీ, తల్లిని పంపుతానని మాట మాత్రం రాయడు. ఆర్నెల్లకే సుశీలమ్మలో హఠాత్తుగా పదేళ్ళ వృద్ధాప్యం వచ్చి చేరింది. తనలో తనే మాట్లాడుకుంటుంది. పరధ్యాన్నం ఎక్కువైపోయింది. తను భర్తను చూడకుండానే కన్ను మూస్తానేమో అనే బెంగ పట్టుకుంది. అదే పనిగా చాకిరీ చేయటంవల్ల చికాకు కూడా ప్రవేశించింది.


అక్కడ ప్రకాశరావు పనీ అలాగే వుంది. మొదట్లో కూతురు చేసే పనుల్లో కొంత పాలు పంచుకుంటున్నానని తృప్తిపడ్డాడు గానీ రాన్రాను ఆ పనులే బాధ్యతలై తనను కట్టి వేస్తాయనుకోలేదు. పెద్ద పెద్ద క్యూల్లో నిలబడి, సిటీ బస్‌ల కోసం ఘడియలు కాసి ఆయన ప్రాణం విసుగు చెందింది. ఒక్క రోజైనా కొంచెం విశ్రాంతి తీసుకుందామనుకుంటే కూతురు ఏదో ఒకటి గుర్తుచేసి ఆ పని పురమాయిస్తుంది. స్కూల్ ఫీజు కట్టడానికి వెళ్తే "తాతగారూ మీ మనవడికి సెకెండ్ ర్యాంక్ వచ్చింది. మీరు మరి కొంచెం శ్రద్ధ తీసుకున్నారంటే ఫస్ట్ ర్యాంక్ ఖాయం'' అని చెప్తారు. పనులన్నీ చేసి వచ్చి అలా నడుం వాలుస్తాడో లేదో 'తాతయ్యా హోమ్‌వర్క్' అంటూ పిల్లలిద్దరూ వస్తారు.

"మీ అమ్మ చేత చెప్పించుకోండిరా నేను కాసేపు నడుంవాలుస్తాను' అంటే వినరు. 'వద్దు తాతయ్యా మమ్మీకి చెప్పటం రాదు. నువ్వు చెప్తే అర్థమవుతుంది. మాకు మంచి మార్కులు కూడా వస్తున్నాయి' అంటూ మారాం చేస్తారు. విశ్రాంతి తీసుకోవలసిన ఆ వయసులో అలసిపోయి రాత్రి పూట పడుకుంటే ప్రకాశరావుకు భార్య గురించి ఆలోచనలు నిద్రపోనివ్వవు. కొడుకు తల్లి గురించి ఎక్కువగా రాయడు. ఎలా ఉందో ఏమో, దానికి మొహమాటం ఎక్కువ. కోడలు ఏమనుకుంటుందో ఏమో అనే మొహమాటంతో ఓపిక లేకపోయినా పనంతా చేస్తుంది. ఈ వయసులో ఎడబాటు కలిగింది ఇద్దరికీ. ఇలా సాగిపోయేవి ఆయన ఆలోచనలు.

ఓరోజు, "అమ్మాయ్ మీ అమ్మ ఎలా ఉందో ఏమో. ఇన్ని నెలలు నన్ను వదిలి ఎప్పుడూ ఉండలేదు. ఒకసారి చూసొస్తాను.'' అన్నాడు ప్రకాశరావు.

ఆ మాటలకు కూతురికి కోపం వచ్చింది. "మీరు ఇన్ని సార్లు అనుకుంటున్నారు గానీ అమ్మకి గానీ, శ్రీధర్‌కి గానీ మీకున్న ప్రేమలో పావువంతులేదు. లేకపోతే ఈ పాటికి అమ్మని తెచ్చి దించేవాడే'' అంది కోపంగా. అంతేకానీ వెళ్ళమని అన్లేదు. ప్రకాశరావు మారుమాట్లాడలేదు.

ప్రకాశరావు వెళ్లానన్నప్పుడల్లా కూతురికి మనసులో గుబులు. అది కప్పిపుచ్చుకుని తమ్ముడి స్వార్థానికి తల్లిని తీసుకుపోయాడనీ పది రోజులుంచుకుని పంపిస్తానని మాట నిలుపు కోలేదనీ సాధించి ఆ మాటల గారడీతో తండ్రి నోరు మూయిస్తుంది. ప్రకాశరావు ఒకటి రెండుసార్లు కొడుకు గురించి కూతురు పక్షంగానే ఆలోచించాడు. గానీ తన పనులు ఎక్కడ ఆగిపోతాయోనని తనను కట్టిపడేస్తున్న కూతురిని ఒక పళ్ళెంలో, కొడుకును ఒక పళ్ళెంలో పెట్టి కొలత చూస్తే త్రాసు ఎటూ మొగ్గుచూపలేదు.



నిన్న నేనో హోటలుకెళ్ళి టిఫిను తింటుంటే ఆ సర్వర్ నా మొహం చూడగానే డబ్బుల్లేకుండా తింటున్నానని గ్రహించాడు'' అన్నాడు నరేంద్ర.

"ఏం చేసేదేం?'' అడిగాడు నాగేంద్ర.

"ఏముంది. బిల్లులో 5 కిలోల బియ్యం, 2 కిలోలు మినపప్పు రుబ్బండి అని రాసిచ్చాడు''

శ్రీ కొండ ఎర్రబోడు

ఇక ప్రకాశరావు ఉండబట్టలేకపోయాడు. ఓ నిర్ణయానికి వచ్చాడు. "నాన్నా, మీ అల్లుడిగారి సూట్ తయారై ఉంటుంది. తీసుకురండి'' అంటూ డబ్బు చేతిలో పెట్టిన కూతురి వంక ఒక్కసారి చూసాడు. వెంటనే అక్కడ నుండి వడివడిగా కదిలి బయటకొచ్చి డబ్బు లెక్క చూసుకున్నాడు. అంతే రైలుస్టేషన్ వైపు నడిచాడు.

• • •

సాయంత్రం నాలుగ్గంటల వేళ కాలింగ్ బెల్ మోగితే నీరసంగా లేచి వచ్చి తలుపు తీసింది సుశీలమ్మ. ఎదురుగా భర్త. అది కలో నిజమో ఆమెకి అర్థంకాలేదు. అది నిజమేనన్నట్లు "బాగున్నావా సుశీలా?'' అని ప్రశ్నించాడు ప్రకాశరావు.

ఆమె తలాడించింది. "మీరు?'' అంది. ఆమె కంటివెంట నీరు ధారగా కారిపోతున్నది. లోపలికి వెళ్ళి తాగటానికి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఆ నీళ్ళు తాగి గ్లాసుకింద పెట్టి "పద వెళ్దాం" అన్నాడు. ప్రకాశరావు.

'ఎక్కడికి' అని ప్రశ్నించలేదు సుశీలమ్మ. ఇద్దరూ ముందుకు నడిచారు. రైలుకి ఇంకా అరగంట టైం ఉంది. టిక్కెట్ కొనుక్కొని ఇద్దరూ వెళ్ళి ఫ్లాట్‌ఫాం మీది సిమెంట్ బెంచ్ మీద కూర్చున్నారు. ఇద్దరికీ ఎన్నో కబుర్లు చెప్పుకోవాలనుంది. ఎన్నో ప్రశ్నలు వేసుకుందామని ఉంది. కానీ ఇద్దరూ మౌనం వహించారు. ఇద్దరి మనసుల్లోనూ ఒక్కటే భావన. శత్రువుల ఉక్కు పిడికిళ్ళ నుండి తప్పించుకుని వచ్చిన భావన.

సుశీలమ్మ నిట్టూర్పు విడిచి "వాళ్ళు మనకు పిల్లలు కాదండీ శత్రువులు, నా గర్భాన పుట్టిన శత్రువులు'' అంది. అది నిజమన్నట్లు ప్రకాశరావు ఆమె భుజం మీద మృదువుగా తట్టాడు. ◆